batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

23 సెప్టెంబర్ 2026
బుధవారం

తాజా వార్తల సద్దిమూట

నిమ్స్ అడిషనల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్

## ఆస్తులు 100 కోట్లకు పైన..

**ఆదాయానికి మించి ఆస్తులు కోసం ఏసీబీ సోదాలలో గుర్తింపు**



నిజాం ఇన్స్ ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ( నిమ్స్ )అదనపు సూపరింటెండెంట్ డా.నోరి లక్ష్మీభాస్కర్ ఆధాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని వచ్చిన

– హైదరాబాద్, బతుకమ్మ మిగితా..2 లో

# రిమ్స్ చిన్న పిల్లల వార్డులో ఏసీ బ్లాస్ట్

**ఊపిరాడక ముగ్గురు పసికందుల మృతి**


ఆదిలాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ( రిమ్స్) ఆసుపత్రిలో ఎస్ ఎన్ సియూ వార్డులో ఏసీ బ్లాస్ట్ జరిగింది. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు పసికందులు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయప డ్డారు. ఎలక్ట్రానిక్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏసి పేలడంతో వార్డులో ఒక్కసారిగా దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఈ ఘటనలో ఊపిరాడక ఐదు రోజుల పసికందుతో పాటు ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఘటన జరిగినప్పుడు స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్ లో 24 నుంచి 27 మంది చిన్నారులు ఉన్నారు. అప్రమత్తమైన సిబ్బంది మిగిలిన పిల్లలను సురక్షితంగా బయటకు తరలించి రక్షించారు. ఘటన స్థలాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లు పరిశీలించారు. ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

– ఆదిలాబాద్ , బతుకమ్మ

### రిమ్స్ ఘటనపై సీఎం తీవ్ర విచారం

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి ఎస్ఎన్సీయూ వార్డులో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారు లను ఆదేశించారు. ఘటనకు దారి తీసిన కార ణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు.





2 లో

మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల

# మెరుపు ఆందోళన

**ప్రతి నెల 5వ తేదిలోపు వేతనాలు ఇవ్వాలి**

**గ్రూపుల నుంచి కాకుండా కార్పొరేషనే వేతనాలివ్వాలని నిరసన**

నిజామాబాద్ మున్సిపల్ కార్పరేషన్ ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు ప్రతి నెల 5 వ తేదీ లోపు ఇవ్వాలని, ఎస్ డబ్ల్యూజీ గ్రూపులు కాకుండా కార్పొరేషనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మెరుపు ఆందోళన చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు వినతి పత్రాలు ఇచ్చిన స్పందించకపోవడంతో మంగళవారం కార్పొరేషన్ ఎదుట తెలంగాణ జేఏసీ కమిటీ, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు.

– నిజామాబాద్ సిటీ, బతుకమ్మ

2 లో






2 లో

సీఎం రేవంత్ రెడ్డి

## ఎస్సీ,ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకతీతంగా పని చేయాలి

విద్య,ఉపాధి,నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, ఎస్సీ, ఎస్టీలపై అణిచివేతను అధిగమిం చేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. దళితులు, గిరిజనులు,ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

– హైదరాబాద్, బతుకమ్మ



# దసరాకు కొత్త పెన్షన్లు


**ఒంటరి మహిళలకు, వితంతువులకు ప్రాధాన్యత**

**రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

దసరా పండుగకు ప్రభుత్వం తీపి కబురు ముందస్తుగానే ప్రకటించింది. ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో భాగంగా కొత్త పెన్షన్ల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

– హైదరాబాద్, బతుకమ్మ

2 లో



# మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల మెరుపు ఆందోళన







నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, వాటర్ సెక్షన్ కార్మికులు, వీధి లైట్ల ఎలక్ట్రిషియన్ గా విధులు నిర్వహిస్తున్నవందల మంది ఉద్యోగులు విధులకు హాజరుకాకపోవడంతో కార్పొరేషన్ లో పారిశుద్ధ్య పనులు, నీటి సరఫరా, వీధి లైట్ల పై ప్రభావం పడింది. కార్పొరేషన్ లో రెగ్యులర్ ఉద్యోగులు మినహా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళనకు దిగడంతో జరిగిన నష్టంపై నివారణ చర్యలకు సిద్ధమైంది. కార్పొరేషన్ ఉద్యోగులు ధర్నాచౌక్ లో ఆందోళనకు దిగడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### గ్రూపుల పేరిట వేతనాల చెల్లింపునకు కొర్రీలు

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో రెగ్యులర్ ఉద్యోగుల కంటే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే ఎక్కువ. ప్రధానంగా పారిశుద్ధ్య, వాటర్ వర్క్, స్ట్రీట్ లైట్, విధి నిర్వహణ కోసం నియామకాలు లేక రెండు దశాబ్ధాలు గడిచింది. రెగ్యులర్ ఉద్యోగుల స్థానంలో కొత్త నియామకాలు లేకపోవడంతో తాత్కాలిక నియామకాలే జరిగాయి. ప్రధానంగా పారిశుద్ధ్య విభాగంలో నియామకాలు లేకపోవడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోనే చెత్త సేకరణ, రోడ్ల ఊడ్చడం, డ్రైనేజీలు తీయడం, డంపింగ్ యార్డుకు చెత్తంతరలింపు అంతా పారిశుద్ధ్య కార్మికులతోనే నడుస్తోంది. వారికి చాలిచాలని వేతనాలు ఇస్తూ ఎలాంటి భద్రత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపణలున్నాయి. వారికి ప్రతీనెల 5లోపు వేతనాలు చెల్లించాల్సి ఉండగా 20 తారీఖు వచ్చినా వేతనాలు లేకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు అప్పుల పాలై ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారు. అదీచాలదన్నట్లు బల్దియాలో విధి నిర్వహణ పారదర్శకత్వం, హాజరుకోసమని తెచ్చిన ఏడుగురు ఉద్యోగులకు ఒక గ్రూప్ అన్నది కార్మికులకు వేతన కష్టాలను తెచ్చి పెట్టింది. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు కాకుండా గ్రూపుల ద్వారా వేతనాలు చెల్లిస్తామని చేపట్టిన కార్యక్రమం వికటించింది. అందులో గ్రూపుల రిజిస్ట్రేషన్ జరుగక వేతనాలు రాకపోవడంతో బల్దియా కార్మికులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికి కార్పొరేషన్ అధికారులు స్పందించకపోవడంతో ఆందోళనకు దిగిన వారికి స్పష్టమైన హామీ దక్కకపోవడంతో నిరసనల కొనసాగింపు జరుగుతుందా? లేక నిలిచిపోతుందా ? అనే సంశయాలు వ్యక్తమౌతున్నాయి.

### కార్పొరేషన్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసనకు మాజీ ఎమ్మెల్యే మద్దతు

నిజామాబాద్ మున్సిపల్ కార్పరేషన్ లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మద్దతు తెలిపారు. ధర్నాచౌక్ లో ఆందోళనకారులను కలిసి బీఆర్ఎస్ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీఆర్ఎస్ హయంలో పారిశుద్ధ్య కార్మికుల నియామకాలు జరిగాయని, వారికి ఉపాధి కల్పించడంతో పాటు ప్రతి నెల 5లోపు వేతనాలు చెల్లించడం జరిగిందని గుర్తు చేశారు. కార్పేరేషన్ ఉద్యోగులకు కనీసం 5లోపు వేతనాలు చెల్లించలేని దుస్థితిలో ఉందని అన్నారు. వేతనాలు చెల్లించలేని పరిస్థితిలోనే ఎస్ డబ్ల్యూజీ గ్రూపుల పేరిట బల్దియా అధికారులు నాటకం ఆడుతున్నారన్నారు. కార్పేరేషనే ఉద్యోగులకు వేతనాలు చెల్లించే వరకు వారికి సంపూర్ణంగా మద్దతు ఇస్తామని ప్రకటించారు.

# రిమ్స్ చిన్నపిల్లల వార్డులో ఏసీ బ్లాస్ట్

### రిమ్స్‌ను సందర్శించిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



ఆదిలాబాద్ రిమ్స్ లోని ఎస్ఎన్ సీయూ వార్డులో జరిగిన ఘటనలో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోగా మరికొంత మంది గాయపడిన ఘటనపై ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరి క్రిస్టీనా జెడ్ చొంగ్తూలు రిమ్స్ ను సందర్శించారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలిక్యాప్టర్ లో ఆదిలాబాద్ కు చేరుకుని రిమ్స్ లో ఎస్ఎన్ సీయూ వార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా రిమ్స్ వైద్యులతో సమీక్షించారు. ఘటన జరిగిన తీరును, చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఘటన పై విచారణకు ఆదేశించారు. దానికోసం కమిటీని ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వాలని సూచనలు చేశారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు.

# నిమ్స్ అడిషనల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ ఆస్తులు 100 కోట్లకు పైన..



ఏసీబీ నిమ్స్ అడిషనల్ సూపరింటెన్సెంట్ నివాసంలో సోదాలు

పిర్యాదు మేరకు ఏసీబీ సోదాలు నిర్వహించింది. మంగళవారం ఉదయం నుంచి 13 ప్రాంతాలలో డాక్టర్ లక్ష్మి భాస్కర్ కు సంబంధించిన ఇండ్లు, బంధువులు, సన్నిహితులు, బినామీ ల వద్ద ఏసీబీ దాడుల్లో తవ్వినకొద్ది అక్రమ ఆస్తులు బయటపడ్డాయి. అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం నోరి లక్ష్మీభాస్కర్ కార్యాలయం, ఇళ్ళపై దాడులు చేశారు. లక్ష్మీభాస్కర్ నివాసంతో పాటు హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో ఏసీబీ ఏకకాలంలో దాడులు నిర్వహించాయి.

ఈ సోదాల్లో భారీ ఎత్తున అక్రమాస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం అక్రమాస్తుల విలువ సుమారు రూ.100 కోట్లకు పైగా ఉంటుందని ఏసీబీ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. కూకట్ ప ల్లి, మణికొండ, పేట్ బషీరాబాద్, కూకట్ పల్లిలోని అపార్ట్ మెంట్ లలో ఖరీదైన ప్లాట్లు, యాదాద్రి, నందిగామ, శామీర్ పేట్ ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్టణంలో 800 గజాల స్థలం, వివిధ బ్యాంక్ ఖాతాల్లో 41 లక్షల నగదు, పోస్టాఫీసుల్లో రూ.12 లక్షల డిపాజిట్లు, పలు ప్రైవేట్ సంస్థల్లో రూ.35 లక్షల మేర పెట్టుబడులు, 517 గ్రాముల బంగారం, 3 ఖరీదైన కార్లు, 4 ద్విచక్ర వాహనాలు గుర్తించారు. గుర్తించిన ఆస్తుల విలువ రూ. 6.13 కోట్ల కాగా,రూ. 1.30కోట్ల పెట్టుబడులు, రూ. 1.33 కోట్ల అప్పులు ఇచ్చినట్టు గుర్తించారు. వీటిపై ఏసీబీ అధికారులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు.

# ఎస్సీ,ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకతీతంగా పని చేయాలి




రాష్ట్రంలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై ముఖ్యమంత్రి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఉన్నత స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. సొంత తల్లిలా ప్రేమ చూపిన మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీని ఆ వర్గాలు ఇప్పటికీ మరిచిపోలేదని పేర్కొంటూ 25 లక్షల ఎకరాల భూములకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరాగాంధీద న్నారు. ఇందిరా గాంధీ స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 16 శాతం ఉంటే, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో 31 శాతం మంది లబ్ధిదారులు ఎస్సీలేనని, ఎస్టీ జనాభా 10 శాతం ఉంటే, వారికి 17 శాతం ఇండ్లను మంజూరు చేశామని వివరించారు. రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని, తద్వారా ఆ వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేయడం ద్వారా దళిత, గిరిజన వర్గాలకు మంచి భోజనం అందించగలుగుతున్నామని చెప్పారు. సంక్షేమ పథకాలతో పాటు చదువు ఒక్కటే అందరి జీవితాలను మారుస్తుందన్న విషయాన్ని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. అట్టడుగు వర్గాలను చదువు వైపు నడిపించకపోతే సమస్యలు పరిష్కారం కావని గుర్తుచేశారు. పిల్లలను చదువు,క్రీడల వైపు ప్రోత్సహించాలని కోరారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు,విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న సహాయం, పునరావాసంపై సమీక్షలో సుదీర్ఘంగా చర్చించారు. చట్టంపై అవగాహన కార్యక్రమాలు, కేసుల విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులు, మొబైల్ కోర్టుల పనితీరును విశ్లేషించారు. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో ఎస్సీ ఎస్టీలపై అట్రాసిటీ కేసులు క్రమంగా తగ్గుముఖం పట్టాయని అధికారులు వివరించారు. కొన్ని జిల్లాల్లో ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. అక్కడ పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని తెలిపారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు సకాలంలో నష్టపరిహారం, సహాయ పునరావాసం అందేలా చూడాలన్నారు. బాధితులను ఆదుకోవడంలో బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించి, బాధిత కుటుబాలకు సత్వర న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క,మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి,బలరాం నాయక్,కడియం కావ్య, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, మేడిపల్లి సత్యం,కవ్వంపల్లి సత్యనారాయణ,వేముల వీరేశం, మందుల సామేల్,మట్టా రాగమయి, వెద్మ బొజ్జు, మురళి నాయక్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య,జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికా రులు పాల్గొన్నారు.

# దసరాకు కొత్త పెన్షన్లు

దసరా పండుగకు కొత్త పెన్షన్లు పంపిణీకి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. కొత్త పెన్షన్ల మంజూరిలో అత్యంత ప్రాధాన్యతగా ఆదరణకు నోచుకోని వారికి ముఖ్యంగా ఒంటరి మహిళలకు, వితంతువులను గుర్తించాలని కోరారు. అర్హత కలిగిన వారిని ఎంపిక చేయడంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. ఒంటరి వితంతువు మహిళకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా కొత్త పెన్షన్ల పంపిణీ చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రజాపాలనలో భాగంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేసే బాధ్యతను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. దానికోసం సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ కు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పెన్షన్ల దరఖాస్తులో వెరిఫికేషన్ కోసం అదనపు సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. వేగవంతంగా ఈ ప్రక్రియను జరిపేలా ప్రయత్నాలు జరుగాలని సూచనలు చేశారు. దసరా నాటికి పెన్షన్ల పంపిణీ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎలాంటి జాప్యం లేకుండా అర్హుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

# ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు.

బాన్సువాడ బతుకమ్మ : ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందూర్ గంగాధర్ తెలిపారు. సెప్టెంబర్ 24, 25 తేదీల్లో స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఇప్పటివరకు డిగ్రీలో అడ్మిషన్ పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు అవసరమైన అన్ని అర్హత ధ్రువీకరణ పత్రాలతో కళాశాలకు హాజరై అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రస్తుతం బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్ కోర్సుల్లో పరిమిత సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు నిర్ణీత తేదీల్లో కళాశాలకు హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.



# సీఎం రేవంత్ డైవర్షన్ సూత్రధారి కపట నాటక పాత్రధారి

## బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి



హైదరాబాద్, బతుకమ్మ : ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ నేతలపై పదేపదే బురద చల్లుతున్న సీఎం రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్ సూత్ర ధారి అని, కాంగ్రెస్ రక్తికట్టిస్తున్న కపట నాటక పాత్రధారి అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలనే కాదు, ముక్కోటి దేవుళ్ళను కూడా మోసం చేస్తున్న పచ్చి అబద్ధాల కోరు సీఎం రేవంత్ రెడ్డి అని ఆయన ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతలకు చెందిన ఫామ్ హౌస్ ల వద్దకు భూముల పరిశీలన పేరుతో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న యాత్రలు రేవంత్ రెడ్డి రూపకల్పన చేసిన ఒక గోబెల్స్ గేమ్ అని, ఇదంతా ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న బ్లేమ్ అని ఆయన మండిపడ్డారు. దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉంది కాంగ్రెస్ వ్యవహార శైలి అని ఆయన విమర్శించారు. 22ఏ లో భూములు పెట్టి లక్షలాది మందికి నరకం చూపిస్తున్న రేవంత్ ఫాసిస్ట్ సర్కార్ పేక మేడలా కూలి పోతుందన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ బండారం బయట పడుతుందనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులతో అక్రమ దాడి చేయించి చితక బాదించారని, మహిళా ఎమ్మెల్యేలను అవమాన పర్చారని జీవన్ రెడ్డి ఆరోపించారు. అకారణంగా సస్పెన్షన్ చేసి అసెంబ్లీకి రాకుండా బీ ఆర్ఎస్ సభ్యులపై కుట్ర చేశారని ఆయన వెల్లడించారు. ఒక చిన్న తప్పు ఉన్నా తన కష్టార్జితమైన 13 ఎకరాల భూమి ప్రభుత్వానికే రాసిచ్చేస్తా అని హరీష్ రావు చేసిన సవాల్ ను స్వీకరించే దమ్ము ప్రభుత్వానికి లేదా అని ఆయన నిలదీశారు. దళితుల భూములను కేసీఆర్ కబ్జా చేయలేదని తేలితే సీఎం రేవంత్, మంత్రులు రాజీనామాకు సిద్ధమా? అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ ఫ్యామిలీపై రాజకీయ కక్షసాధింపు యాత్రలు కాంగ్రెస్ దమననీతికి నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత భూములపై ప్రశ్నిస్తే నేరమా, ఆ మాత్రానికే ఇన్ని కక్షపూరిత చర్యలా, కేవలం ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రధాన నేతలను బదనాం చేసేందుకే ఈ అసంబద్ధ భూ సర్వేలు అని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ కు ఎర్రవల్లిలో ఫామ్ హౌస్ లో కేవలం 62 ఎకరాల వ్యవసాయ భూమి మాత్రమే ఉందన్నారు. ఆభూమిలోనే వ్యవసాయం చేస్తూ పంటలు పండిస్తూ ఉంటే దానికి విరుద్ధంగా రూ. లక్ష కోట్ల విలువైన 1,000 ఎకరాల భూమి ఉందని రేవంత్ రెడ్డి అనడం దారుణమని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ కు నీతి నిజాయితీ గురించి ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి ఆయన కొడుకు చేస్తున్న భూ దందాలను ఎప్పుడైతే ఎండగట్టిందో అప్పుడే కుట్ర బుద్ధితో కక్షకట్టి బీ ఆర్ఎస్ పై ఎదురుదాడి చేస్తున్నారని ఆయన అన్నారు. సభలో ప్రతిపక్షం ఉంటే ప్రభుత్వ బండారం బయటపడు తుందనే దురుద్దేశంతోనే సస్పెండ్ చేసి ఏకపక్షంగా సభను నడిపారని విమర్శించారు.

# జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మర్కల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు సత్తా





### 11 స్వర్ణ పథకాలు, 10 రజత పథకాలు, 4 కాంస్య పథకాలు

### విద్యార్థినిల అభినందించిన ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి

సదాశివనగర్, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా మర్కల్ గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని 11 స్వర్ణ పథకాలు, 10 రజత పథకాలు, 4 కాంస్య పథకాలతో సత్తా చాటారు. వివరాల్లోకి వెళ్తే సి. హెచ్. వైష్ణవి అండర్ 20 డిస్కస్ త్రో లో గోల్డ్ మెడల్,ఎస్. దివ్య 800 మీటర్ పరుగు లో గోల్డ్ మెడల్,ఎం. మహేశ్వరి అండర్ 18 జావెలిన్ త్రో లో గోల్డ్ మెడల్,ఎం. వెన్నెల 400 మీటర్ పరుగు లో గోల్డ్ మెడల్, బి. నవ్య శ్రీ అండర్ 20 జావెలిన్ త్రో లో గోల్డ్ మెడల్,బి. ప్రహర్ష అండర్ 20-400 పరుగు లో గోల్డ్ మెడల్,జె. కీర్తన డిస్కస్ త్రో లో గోల్డ్ మెడల్,కే. దివ్య అండర్- 20- 100మీటర్ పరుగు లో గోల్డ్ మెడల్,జి. అర్చన అండర్ 20-800 మీటర్ పరుగు లో గోల్డ్ మెడల్,పి. ఛాయా 100 మీటర్ పరుగులో గోల్డ్ మెడల్,ఓ. శిరీష అండర్ 18 షాట్ పుట్ లో గోల్డ్ మెడల్, ఎం. సవిత అండర్ 20 డిస్కస్ త్రో లో సిల్వర్ మెడల్,ఆర్. ప్రీతి అండర్ 20-100 మీటర్ పరుగు లో సిల్వర్ మెడల్,ఈ. రాజశ్రీ అండర్-20-800 మీటర్ పరుగు లో సిల్వర్ మెడల్, పి. రుతిక 400మీటర్ పరుగు లో సిల్వర్ మెడల్,బి. అర్చన అండర్ -18-100 మీటర్ పరుగులో సిల్వర్ మెడల్, ఆర్. రాసాజ్ఞ అండర్ 20 షాట్ పుట్ లో సిల్వర్ మెడల్, సి. హెచ్. శిరీష అండర్ 20-400 మీటర్ పరుగులో సిల్వర్ మెడల్,మనుష బాయి అండర్- 20 - 400 మీటర్ పరుగులో సిల్వర్ మెడల్,ఎం. అమృత జావెలిన్ త్రో లో సిల్వర్ మెడల్,కే. స్వప్న అండర్ -20 జావెలిన్ త్రో లో సిల్వర్ మెడల్ టి .భవాని అండర్ -20-800 మీటర్ పరుగు లో బ్రాంజ్ మెడల్,ఎన్. స్పందన అండర్ -20-100మీటర్ పరుగులో బ్రాంజ్ మెడల్, ఎం. గాయత్రి షాట్ పుట్ లో బ్రాంజ్ మెడల్,జి. లావణ్య డిస్కస్ త్రో లో బ్రాంజ్ మెడల్,సాధించారు. ఎం. అమృత,వైష్ణవి,బి. నవ్యశ్రీ,ఎం. మహేశ్వరి,బి. ప్రహర్ష,జి. అర్చన,ఎం. వెన్నెల లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు స్టేట్ లెవెల్ లో జరుగబోయే పోటీలకు ఎంపికయ్యారు. చక్కని ప్రతిభ కనబరిచినందుకు గాను విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి,వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి,ఫిజికల్ డైరెక్టర్ రమాదేవి తో పాటు అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

### గౌడ సంఘం అధ్యక్షులుగా

# గోవింద్ గౌడ్ ఎన్నిక...




రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండలం గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంఘం ఎన్నికలు నిర్వహించడం జరిగింది. సంఘం మొత్తంలో 86 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 83 ఓట్లు పోల్ అవ్వడం జరిగింది. ఇందులో మీసాల గోవింద్ గౌడ్ 48 ఓట్లతో గౌడ సంఘం అధ్యక్షులుగా విజయం సాధించారు. గత క్రితం అధ్యక్షునిగా విధులు నిర్వహించిన గుండూరు విట్టల్ గౌడ్ కు 25 ఓట్లు, షేరెలా శంకర్ గౌడ్ కు 10 ఓట్లు పోల్ కావడం జరిగింది. ఇది తెలుసుకుని పెటిక సంగం ప్రచార కమిటీ సభ్యులు, సీనియర్ పాత్రికేయులు కన్నె రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అందుగుల శ్రీధర్ గౌడ్ విజయం సాధించిన గౌడ సంఘం అధ్యక్షులు మీసాల గోవింద్ గౌడ్ కు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా రాబోయే రెండు సంవత్సరాలు గౌడ కుల సభ్యులకు అందుబాటులో ఉండి కుల సంఘం ప్రగతికి తనవంతు కృషి చేయాలనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జై శంకర్ గౌడ్, ప్రకాష్ గౌడ్, జగన్ గౌడ్ కుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏర్గట్ల మండలంలో పంటల సర్వే ప్రక్రియ ప్రారంభం

### ఏర్గట్ల మండల వ్యవసాయ అధికారి వైష్ణవ్

బతుకమ్మ,ఏర్గట్ల;ఏర్గట్ల మండలంలో మంగళవారం రోజున ఏర్గట్ల మండల వ్యవసాయ అధికారి వైష్ణవ్ ఆధ్వర్యంలో పంటల సర్వే ప్రక్రీయ ప్రారం భించడం జరిగింది.ఇట్టి సందర్భంలో ఏర్గట్ల వ్యవసాయ అధికారి వైష్ణవ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా అన్ని పంటల సర్వే పూర్తి చేయాలని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు రాకుండా పక్కాగా సర్వే ప్రక్రీయ పూర్తి చేయాలని ఏర్గట్ల మండలంలోని గ్రామాల వాలంటీర్లను ఆదేశించారు. అలాగే గ్రామాల్లోని రైతులు వాలెంటర్లకు సహకరించాలని కోరడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో విస్తరణ అధికారి మనిషా పాల్గొన్నారు.



### వ్యవసాయ మార్కెట్ నిర్మాణం కోసం పరిశీలించిన ఎమ్మెల్యే



ఆర్మూర్, బతుకమ్మ : అంకాపూర్ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ వ్యవసాయ మార్కెట్ నిర్మాణం కోసం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రస్తుత వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను సందర్శించి పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న వ్యవసాయ మార్కెట్ పక్కన, కెనాల్ బ్రిడ్జి పక్కన ఉన్న మొక్కజొన్న కొనుగోలు మార్కెట్ ను, ప్రస్తుత వ్యవసాయ మార్కెట్ ను కలుపుతూ మధ్యలో బ్రిడ్జి నిర్మించి, రెండింటిని కలిపి అత్యాధునిక వసతులతో ఇంటిగ్రేటెడ్ వ్యవసాయ మార్కెట్ గా తీర్చిదిద్దాలని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

# జీజీ కళాశాలలో కేంద్రం మంజూరుకు వినతి పత్రం



డిచ్‌పల్లి, బతుకమ్మ: తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ టి.యాదగిరి రావు,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరి, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ లను నిజామాబాద్ గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు టీయూ ఈసీ మెంబర్ డాక్టర్ దండుస్వామి నేతృత్వంలో జి.జి కళాశాలకు పరిశోధన కేంద్రంను మం జూరు చేయవలసిందిగా వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ఒక కమిటీని ఏర్పాటు చేసి, పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. రామ్మోహన్ రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ రంగరత్నం, డా. ఇందూరు గంగాధర్, వినయ కుమార్, లెఫ్టినెంట్ డాక్టర్ ఎం రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

### నగరంలో 24 నుంచి 26 వరకు

# ట్రాఫిక్ డైవర్షన్

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నెలకొల్పిన గణేష్ ప్రతిమల నిమజ్జనం సందర్భంగా ఈ నెల 24 నుంచి 26వ తేది వరకు ట్రాఫిక్ డైవర్షన్ ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లీస్తున్నట్లు తెలిపారు. హైదరాబాదు నుంచి నిజామాబాద్ వచ్చి వెళ్లే వాహనాలు, ఆర్టీసీ బస్సులు ముఖ్యంగా మాధవ నగర్ బైపాస్,కంటేశ్వర్ బైపాస్,రైల్వే అండర్ పాస్,ఎన్టీఆర్ చౌరస్తా,రైల్వే స్టేషన్ గుండా ఆర్టీసీ బస్టాండ్ చేరుకోవాల్సి ఉంటుందని తెలిపారు. బోధన్ వచ్చి వెళ్లే వాహనాలు, ఆర్టీసీ బస్సులు,అర్సపల్లి చౌరస్తాలో ఎడమవైపు తిరిగి,బైపాస్ గుండా ప్రయాణిస్తూ కొత్త కలెక్టరేట్,కంటేశ్వర్ బైపాస్,రైల్వే అండర్ పాస్,ఎన్టీఆర్ చౌరస్తా నుండి బస్టాండ్ చేరుకోవాలని తిరిగి ఇదే దారిలో బోధన్ కు వెళ్లాలన్నారు. ఆర్మూర్ వైపు నుండి నిజామాబాద్ బస్టాండ్, ఇతర ప్రాంతాలకు వచ్చి వెళ్లే వాహనాలు కంటేశ్వర్ బైపాస్ చౌరస్తా వరకు చేరుకొని అక్కడి నుండి నేరుగా రైల్వే అండర్ పాస్, ఎన్టీఆర్ టీ జంక్షన్ వద్ద కుడి వైపుకు తిరిగిరైల్వే స్టేషన్ ముందరి నుండి బస్టాండ్ చేరుకోవాలని, ఇదే దారిని ఉపయోగిస్తూ ఆర్మూర్ వైపు తిరిగి వెళ్ళవచ్చున్నారు. బాన్సువాడ, వర్ని వైపు నుంచి వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు నిజామాబాద్ లోని వర్ని చౌరస్తా వరకు చేరుకొని అక్కడి నుండి కుడి వైపుకు తిరిగి ఆర్.ఆర్ చౌరస్తా గుండా పులాంగ్ చౌరస్తా,ఎల్లమ్మ గుట్ట చౌరస్తా,కోర్ట్ చౌరస్తా,ఎన్టీఆర్ చౌరస్తా నుండి రైల్వే స్టేషన్ ముందర నుండి బస్టాండ్ చేరుకోవాలనీ, ఇదే దారిని ఉపయోగించి తిరిగి వెళ్లాలని సూచించారు. భారీ వాహనాలు ఎట్టి పరిస్థితిలో 24వ తారీకు ఉదయం 11 గంటల నుండి 26వ ఉదయం 11 గంటల వరకు నగరంలో ప్రవేశించరాదన్నారు. కంటేశ్వర్ రైల్వే అండర్ పాస్ ఎత్తు ముఖ్యంగా రైల్వే అండర్ పాస్ యొక్క ఎత్తు రోడ్డు నుండి 13 ఫీట్లు ఉన్నందున,ఇట్టి విషయాన్ని గమనించి 13 ఫీట్ల లోపల,ఉండే గణపతి విగ్రహాలు మాత్రమే కంటేశ్వర్ రైల్వే అండర్ పాస్ ఉపయోగించాల న్నారు. అదేవిధంగా 13 ఫీట్లు మించిన గణపతి విగ్రహాలు, 13 ఫీట్లు మించిన గణపతి విగ్రహాలు ముఖ్య శోభాయాత్ర అనగా రథము వెళ్ళిన తరువాత రైల్వే ఫ్లైఓవర్ను ఉపయోగించుకొని వెళ్లాలన్నారు. పట్టణ ప్రజలు విషయాన్ని గమనిస్తూ ప్రయాణాలు కొనసాగించాలని సీపీ సాయి చైతన్య విజ్ఞప్తి చేశారు.

## వైభవంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండల కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సంఘం గణేష్ మండపంలో కొలువుతీరిన గణనాథునికి 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం గణేష్ నిమజ్జన శోభాయాత్రను గణేష్ మండలి సభ్యులు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. మహిళల కోలాటాలు, భజనలు, కీర్తనలతో ప్రధాన వీధుల గుండా గణేష్ నిమజ్జన శోభాయాత్ర కొనసాగింది. అనంతరం గణనాథుడిని గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండలి సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## నూతన కమిటీ సభ్యులకు సన్మానం..



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : నూతనంగా ఎన్నికైన రుద్రూర్ గ్రామ ముస్లిం మైనారిటీ కమిటీ సభ్యులను తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు షేక్ ముజాహిద్ శాలువ, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరు కలిసికట్టుగా ఐక్యమత్యంతో ముందుకు సాగాలని, ముస్లిం సమాజం యొక్క అభివృద్ధి కోసం ఏర్పడిన కమిటీ ఎల్లప్పుడూ ప్రజాసేవలో ఉండాలని, ఆ అల్లహ్ కృప ఆసిస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ గ్రామ ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షులు సయ్యద్ ముల్తాని, ఉపాధ్యక్షులు ఇమ్రాన్ కురేషి, కార్యదర్శి షేక్ సుభాని, ఎండి జమీల్, ఖాజా కురేషి, సయ్యద్ రహీం, సులేమాన్ నగర్ అఖీల్ తదితరులు ఉన్నారు.

### చెత్త కుప్పల తొలగింపు..

## తాడ్కోల్ సర్పంచ్ చర్యలు

బాన్సువాడ బతుకమ్మ : కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామ పరిధిలో రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తాడ్కోల్ గ్రామపంచాయతీ సర్పంచ్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో తొలగించారు. రహదారి పక్కన చెత్త పేరుకుపోవడంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య సిబ్బందితో ట్రాక్టర్ సహాయంతో చెత్తను పూర్తిగా తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలు కూడా రహదారుల వెంట చెత్త వేయకుండా గ్రామపంచాయతీకి సహకరించాలని సర్పంచ్ కోరారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.



# అభి స్కూల్‌లో విద్యాశాఖ అధికారుల తనిఖీలు..





### అనుమతుల్లేని 9,10 క్లాసులకు సీజ్ చేసిన విద్యా అధికారులు...

బాన్సువాడ బతుకమ్మ : కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని అభి ప్రైవేట్ పాఠశాలలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న 9, 10 తరగతులపై మండల విద్యాధికారి చందర్ చర్యలు చేపట్టారు.పాఠశాలను పరిశీలించిన ఎంఈవో 9, 10 తరగతి గదులను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం అనుమతులు లేని తరగతి గదులను సీజ్ చేశారు.ఇదిలా ఉండగా, పాఠశాల యాజమాన్యం టీసీలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. 9, 10 తరగతులకు ప్రభుత్వ అనుమతి లేదని, తమ పిల్లలకు టీసీలు ఇవ్వాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.ఫీజు చెల్లిస్తేనే టీసీ ఇస్తామని ప్రిన్సిపల్ చెప్పడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో చందర్ పాఠశాలలో 9, 10 తరగతులకు అనుమతులు లేవని నిర్ధారించి, ఆయా తరగతి గదులను సీజ్ చేసినట్లు తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహణపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.అధిక ఫీజులు వసూలు చేస్తూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నిర్వహిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్వీ నాయకుడు సాయిబాబ డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు.

# స్నేహ సొసైటీలో మానసిక వికలాంగుల తల్లిదండ్రులతో సమావేశం

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : మానసిక దివ్యాంగులను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర చాలా ఎక్కువగా ఉంటుందని, వారు సరియైన దిశలో పిల్లల కోసం సమయాన్ని కేటాయించినట్లయితే వారిని ఉపయోగకర పౌరులుగా మార్చడానికి అవకాశం ఉంటుందని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇన్నమూరి రవితేజ అన్నారు. మంగళవారం నగరంలోని మారుతినగర్ లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ లో మానసిక దివ్యాంగుల పాఠశాల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇన్నమూరి రవితేజ ముఖ్య అతిథిగా హాజరై తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. మానసిక దివ్యాంగులు తల్లిదండ్రులకు దేవుడిచ్చిన ప్రసాదమని వారిని జాగ్రత్తగా పెంచి, ఉపయోగకర పౌరులుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ప్రతి తల్లిదండ్రులు వారి దివ్యాంగ పిల్లల సమస్యలను గుర్తించి వాటిని క్రమ పద్ధతిలో ఒక పేపర్ పై రాసుకొని వాటిలో చిన్న సమస్యలను ముందుగా తీసుకొని ఆ సమస్యలను దూరం చేయడంలో




వారికి కావలసిన సహాయాన్ని అందించాలని దీనివల్ల పిల్లల్లో ప్రవర్తన పరమైన సమస్యలు దూరం అవుతాయని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్క తల్లి వారి దివ్యాంగ పిల్లల కొరకు ఏబీసీ పాటర్న్ లో ప్రవర్తనను మార్చవచ్చని పిల్లవాడు ప్రవర్తన కంటే ముందు జరిగిన అంశాలను, ప్రవర్తన తర్వాత జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని పిల్లలను పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్నేహ సొసైటీ కార్యదర్శి స్నేహ సొసైటీ మానసిక దివ్యాంగుల కోసం అందిస్తున్న సేవలను, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఏర్పాటు చేయవలసిన లోకల్ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలలో మానసిక దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు పని చేస్తుందని తెలిపారు. పాత కమిటీలో బాబా గౌడ్ చైర్మన్ గా,జగదంబరావు వైస్ చైర్మన్ గా,ఎన్. లక్ష్మి టీచర్ కన్వీనర్ గా, పేరెంట్స్ సూర్య ప్రకాష్, ఆస్మాలు కమిటీ సభ్యులుగా ఉన్నారు. వీరి పదవీకాలం నూతన కమిటీ సభ్యులుగా బ్రహ్మానంద రెడ్డి చైర్మన్ గా, రామ్ సుజన్ వైస్ చైర్మన్ గా, ఇంద్రాణి టీచర్ కన్వీనర్ గా, పేరెంట్స్ భాగ్యలక్ష్మి, బ్రహ్మయ్యలు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.జ్యోతి,మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులు,
దివ్యాంగులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువా పూలమాలలతో

## ఘనంగా పురస్కార కార్యక్రమం



ఏర్గట్ల,బతుకమ్మ: ఏర్గట్ల మండలంలోని రైతు వేదిక సమావేశం హాల్లో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి బీరెల్లి ఆనంద్ రావు,ఏర్గట్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణ చారిఉన్నత,ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏర్గట్ల మండల పి,ఆర్ టి, యు,అధ్యక్షులు కృష్ణప్రసాద్,తపస్ జిల్లా అధ్యక్షులు కిషన్‌రెడ్డి, పి,ఆర్ టి,యు ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ శర్మ, యుటిఎఫ్ మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు గణేష్,శంకర్, తపస్ మండల అధ్యక్షులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.ఇట్టి సందర్భంలో వక్తలు మాట్లాడుతూ,విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పాఠ్యబోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు,సృజనాత్మకత, సామాజిక బాధ్యతలను పెంపొందిస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించడం అభినందనీయమని అన్నారు.ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని శాలువాలతో సత్కరించి, పురస్కారాలు అందజేశారు. అలాగే ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి సన్మానించడం మరింత బాధ్యతతో పనిచేయడానికి ప్రోత్సాహాన్ని ఇస్తుందని వారు తెలిపారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన సర్పంచ్ అరిగే ధర్మ తేజ.

బాన్సువాడ బతుకమ్మ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా బీర్కూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి సొంతింటి కల సాకారమైంది. గ్రామానికి చెందిన మొడ పార్వతి, మొడ రాములు దంపతులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం మంగళవారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది.ఈ కార్యక్రమానికి బీర్కూర్ గ్రామ సర్పంచ్ అరిగే ధర్మ తేజ ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం గృహప్రవేశం చేసిన మొడ పార్వతి--రాములు దంపతులను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ ధర్మ తేజ మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా గ్రామపంచాయతీ తరఫున కృషి చేస్తున్నామని తెలిపారు. కొత్త ఇంట్లో మొడ పార్వతి--రాములు కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఏళ్లుగా అద్దె ఇళ్లలో, పూరిగుడిసెల్లో జీవిస్తున్న పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు మంజూరు కావడం సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌తో పాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ గంగారం, స్థానిక నాయకులు యామ రాములు, కుమ్మరి సాయిలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్
# ఆర్థిక సహాయం అందజేత



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ గ్రామానికి చెందిన షేక్ మజర్, అబ్దుల్ జమీలుద్దీన్ ఆరోగ్య పరిస్థితి బాగాలేదని కోనేరు చాటబుల్ ట్రస్ట్ లో దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా వారి కుటుంబాలకు తన వంతు సహాయంగా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రుద్రూర్ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్, ఉపాధ్యక్షులు బోజగౌండ అనీల్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, జిల్లా నాయకులు కటిక రామరాజు తదితరులు పాల్గొన్నారు.



## సార్వజనిక్ గణేష్ మండలి లడ్డును రూ.33, 000 కైవసం చేసుకున్న సమర్థి యాదవ్..



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండలంలోని అంబం (ఆర్) గ్రామంలో శ్రీ సార్వజనిక్ గణేష్ మండలిలో కొలువు దీరిన గణనాథునికి 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం గణనాథుని నిమజ్జన శోభాయాత్రను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. శ్రీ సార్వజనిక్ గణనాథుని చేతిలో ఉన్న లడ్డును వేలం పాట నిర్వహించగా, గ్రామానికి చెందిన పట్టేపు రాములు మనవడు సమర్థి యాదవ్ రూ. 33 వేలకు కైవసం చేసుకున్నారు. పట్టేపు రాములు 4 వ సారి లడ్డును కైవసం చేసుకోవడం ఆ గణనాథుని యొక్క కృప అని గణేష్ మండలి సభ్యులు ప్రశంసించారు. అలాగే గణపతి మెడలోని హారాన్ని కమ్మరి ప్రణీత్ రూ. 11,555 కైవసం చేసుకున్నారు. ఈ శోభయాత్రలో గణేష్ మండలి సభ్యులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు..

రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్ - 8 లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు, చిన్నారులకు అన్న ప్రసన్న కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ పాల్గొని గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రసన్న కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ నందిని, పిఎస్ హెచ్ఎం కృష్ణవేణి, హెల్త్ సూపర్వైజర్ జ్యోతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ శృతి, గోపి లక్ష్మి, వార్డు మెంబర్లు, అంగన్వాడి టీచర్లు, గర్భిణీ బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



## ఏర్గట్ల శ్రీ శివ మార్కండేయ పద్మశాలి యూత్ ఆధ్వర్యంలో లంబోధరుని నిమజ్జన మహోత్సవం

### డీజే సౌండ్ సిస్టం లేక,ఎంతో భక్తితో భజన కీర్తనలతో పాటలు పాడుతూ ..



బతుకమ్మ,ఏర్గట్ల:శ్రీ శివమార్కండేయ పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్గట్ల మండల కేంద్రంలో ఎంతో సంప్రదాయబద్ధంగా,మన సంస్కృతిని కాపాడుకుంటూ డీజే సౌండ్ సిస్టం సమకూర్చుకోకుండా ఓన్లీ భజన,కీర్తనలతో భక్తితో పాటలు పాడుతూకేవలం గణపయ్య కీర్తనలతో, నిమజ్జన మహోత్సవాన్ని అత్యంత వైభవంగా లంబోదరుని నిమజ్జన మహోత్సవాన్ని నిర్వహించుకోవడం జరిగింది.ఇట్టి సందర్భంలో శ్రీ శివ మార్కండేయ పద్మశాలి యువజన సంఘ సభ్యులు మాట్లాడుతూ లంబోదరుని,గణనాథుని, ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై అలాగే ఏర్గట్ల గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీ శివ పద్మశాలి యువజన సంఘ సభ్యులు,మహిళలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చిన్న ఉద్యోగి స్థాయిలోనే అంత లంచమా?

### పట్టాదారు పాసు పుస్తకాలు రైతుకు ఇచ్చేందుకు రూ.లక్షా 80 వేలు లంచం

### రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

మంచిర్యాల్, బతుకమ్మ : గ్రామ స్థాయిలో ఉన్న ఓ ఉద్యోగి 1,80,000 లంచం డిమాండ్ చేశాడంటే ప్రభుత్వ ఉద్యోగుల లంచాల కక్కుర్తి ఏ స్థాయికి చేరిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులకు లంచాలే భోజనంగా జీతం లాంచనంగా తయారైంది. ప్రస్తుత పరిస్థితి అది. మంచిర్యాల జిల్లాలో దుర్గాప్రసాద్ పెద్దపేట గ్రామపంచాయతీకి చెందిన సాధారణ ఉద్యోగి దుర్గాప్రసాద్ ఒక లక్షా 80 వేల రూపాయలు లంచం కేసులో చిక్కిపోయాడు. ఒక భూమికి సంబంధించి బదలాయింపును ఖరారు చేసి, తన దగ్గర ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలు రైతుకు ఇచ్చేందుకు ఒక లక్షా 80 వేల రూపాయలు లంచం డిమాండ్ చేశారు. దీనికి 80,000 అడ్వాన్సుగా ముందే తీసేసుకున్నాడు మిగిలిన లక్ష రూపాయలు ఇవ్వబోతుండగా రైతు ఏసీబీ అధికారులు సమాచారం ఇచ్చారు. ఏసీబీ అధికారులు దాడి చేసి బిట్టుపల్లి మండలంలో ఆ ఉద్యోగి చెప్పిన ప్రాంతానికి రైతుపోయినప్పుడు, లంచం తీసుకొని మోటార్ సైకిల్ పెట్టుకున్న తర్వాత ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అతనితోపాటు మరో సహ ఉద్యోగిని కూడా అరెస్టు చేసి జైలుకు పంపారు.



## వారోత్సవ సందర్భంగా మొక్కలు నాటిన సర్పంచ్ సందే రంజిత్





ఏర్గట్ల:,బతుకమ్మ:నాగేంద్ర నగర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ సందే రంజిత్ స్వచ్ఛతా హీసేవా వారోత్సవాల్లో భాగంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇట్టి కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ సందే రంజిత్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం పెంపొందించడం, పరిశుభ్రమైన వాతావరణం ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సర్పంచ్ సందే రంజిత్ సూచించారు.పాఠశాల ప్రాంగణంతో పాటు గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.స్వచ్ఛత,పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వార చిన్న వయస్సు నుంచే పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై బాధ్యతాయుతమైన భావన పెంపొందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యుడు ఎర్రాజి హరీష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన నగేష్ రెడ్డి

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ రెండు సంవత్సరాల పదవి పూర్తి చేసుకున్నసందర్భంగా నిజామాబాద్ డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి సన్మానించి సత్కరించారు. మంగళవారం మహేష్ కుమార్ గౌడ్ ని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



# మట్టి వినాయకుడిని పూజించడమే మనకి ప్రకృతికి శ్రేయస్కరం

### ఇస్కాన్ కంఠేశ్వర్ కేంద్రం అధ్యక్షులు రామానంద రాయ్ గౌరదాస్

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : వినాయక నవరాత్రులలో భాగంగా మట్టి వినాయక ప్రతిమను ప్రతిష్ఠించడమే కాకుండా 1500 భగవద్గీతలతో స్వామివారి రూపాన్ని తీర్చిదిద్ది సందేశాత్మకంగా వినాయక నవరాత్రులను నిర్వహిస్తున్న రవీంద్ర గణేష్ మండలి వారిని ఇస్కాన్ కంటేశ్వర్ కేంద్రం అధ్యక్షులు రామానంద రాయ్ నేతృత్వంలోని బృందం వారి గణపతి మండపానికి వెళ్లి కలిసారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించి ఒక వినూత్నమైన ఆలోచనతో భగవద్గీతలను ప్రచారంలోకి తీసుకువచ్చిన కమిటీ అధ్యక్షుడు సుభాష్ ని ఇస్కాన్ తరపున సన్మానించారు. ఈ సందర్భంగా రామానంద రాయి మాట్లాడుతూ మట్టి వినాయకుడిని పూజించడమే శాస్త్రపరంగా సరైనదని, ఆ పద్ధతిలో పూజించడం ద్వారానే భగవంతుడు అనుగ్రహం లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మాదాసు స్వామి యాదవ్,రవి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయంపై ఏసీబీ దాడులు

**ప్రైవేట్ వ్యక్తులతో వసూళ్ళు చేస్తున్న రవాణా శాఖాధికారులు**

**రూ.24,760 స్వాధీనం**

**ఏజంట్ల ద్వారా యూపీఏ చెల్లింపులు జరిగినట్లు గుర్తింపు**

హైదరాబాద్, బతుకమ్మ :రవాణా శాఖలో ఎన్నిమార్పులు తెచ్చినా వసూళ్ళ కార్యక్రమం మాత్రం ఆగడం లేదు. రవాణా శాఖాధికారులు, సిబ్బంది కూడబల్లుకుని రవాణా శాఖ యూనిట్ కార్యాలయాలకు వచ్చే ప్రజలను పైసల కోసం పీడిస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. రంగారెడ్డి రేంజ్ ఏసీబీ అధికారులు రవాణా శాఖ సౌత్ జోన్ లోని బండ్లగూడ ఆర్టీవో ఆఫీస్ పై మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ వ్యక్తుల ద్వారా రవాణా శాఖలో సేవల కోసం వచ్చిన వారి నుంచి యూపీఏ చెల్లింపులు జరుగుతున్నట్లు గుర్తించారు. దాని కోసం ప్రైవేట్ వ్యక్తులను ఏజంట్లుగా నియమించినట్లు గుర్తించారు. ఏజంట్లు ఇచ్చిన సమాచారం మేరకు బండ్లగూడ ఆర్టీవో కార్యాలయంలోని ఏవో సునీత, సీనియర్ అసిస్టెంట్ మహ్మద్ ఇమ్రాన్, జూనియర్ అసిస్టెంబ్ బాబుజి, ఏవో హేమంత్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ సాయికుమార్, లతీఫ్ ఖాన్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ల ఆధ్వర్యంలో ఫైళ్ళు ముందుకు కదలడానికి ప్రైవేట్ వ్యక్తుల ద్వారా వసూళ్ళ కార్యక్రమం జరుగుతున్నట్లు గుర్తించారు.



ఏజంట్ల వద్ద నుంచి రూ.24,760 నగదు స్వాధీనం చేసుకున్నారు.సీనియర్ అసిస్టెంట్ సాయికుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ల వద్ద నుంచి 33 ట్రాన్స్ పోర్టు అప్లికేషన్ లు మిస్సింగ్ అయ్యాయని, అవి ఏజంట్ల ద్వారానే లావాదేవీలు జరుగుతన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. బండ్లగూడ ఆర్టీవో




కార్యాలయంలో పని చేస్తున్న ఎం.ఏ.లతీఫ్ 20 ఏళ్ళుగా అక్కడే పని చేస్తున్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. ఈ మేరకు రవాణా శాఖాధికారులకు ఆర్టీవో కార్యాలయంలో జరుగుతున్న వసూళ్ల బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై రిపోర్టును పంపిస్తున్నట్లు తెలిపారు.

# తెలంగాణ సంస్కృతి ప్రతికలుగ నిర్మాణాలు జరుగాలి





**తెలంగాణ భవన్..**
**ఎయిర్ పోర్ట్‌లు నిర్మాణంపై సీఎం సమీక్షా**

హైదరాబాద్, బతుకమ్మ :ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ నిర్మాణాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి  అధికా రులను ఆదేశించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృ తికి ప్రతిరూపాలుగా ఉన్న కాకతీయ కళాతో రణం, రామప్ప ఆలయం, పిల్లలమర్రి దేవాల యం.. శిల్ప, వాస్తు కళను పరిశీలించి, అవి ప్రతిబింబించేలా నిర్మాణాలు చేపట్టాలని సూచిం చారు.ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణాలపై ముఖ్య మంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాల యంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు నిర్మించే ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ లైన్ల మార్పు, వాగుల ప్రవాహం మార్పు, రహదారుల మళ్లింపు, బీఎస్ఎన్ఎల్ లైన్లు, తాగునీటి సరఫరా లైన్ల మార్పు అంశాలను అధికారులు ముఖ్యమంత్రి కి తెలియజేశారు.ఆయా అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. విమానాశ్రయాల కాంపౌండ్ వాల్ సమీపం నుంచి  రహదారులు నిర్మించాలని, ఆ రహదారులను సమీప జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులకు అనుసంధానం చేయాలని సూచించారు.ఏ శాఖకు ఆ శాఖ విడివిడిగా పనులు చేపడితే, అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని అన్నారు. విద్యుత్, ఆర్ అండ్ బీ, తాగునీటి సరఫరా, నీటి పారుదల శాఖ అధికారులు సమావేశమై బీఎస్ఎన్ఎల్ అధికారులతో చర్చించి, ఏకకాలంలో పనులు సాగేలా చూడాలని సూచించారు.ప్రస్తుత అవసరాలనే కాకుండా భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర ప్రణాళిక రూపొందించుకొని పనులు ముందుకు సాగేలా చూడాలని సూచించారు. వాగులు, ఇతర నీటి ప్రవాహాలను మళ్లించాల్సి వస్తే, విమానాశ్రయాల ప్రాంగణం లేదా సమీపంలో చెరువులను నిర్మించి, అక్కడి నుంచి ప్రవాహాలను మళ్లించేలా చూడాలని చెప్పారు. విమానాశ్రయాలకు వచ్చే, వెళ్లే రహదారులు విశాలంగా ఉండడంతో పాటు సమీపంలోని ముఖ్య రహదారులకు అను సంధానించేలా ఉండాలని, నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలతో పాటు ఢిల్లీ తెలంగాణ భవన్ నిర్మాణాలకు సంబం ధించిన డిజైన్లను ముఖ్యమంత్రి  సమావేశంలో పరిశీలించారు. ప్రతి నిర్మాణంలోనూ తెలంగాణ సంస్కృతి, శిల్ప, వాస్తు కళలకు పెద్దపీట వేయా లని ఆదేశించారు. పలు ఆకృతులకు సంబం ధించి ముఖ్యమంత్రి  మార్పులను సూచిం చారు.ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , ఎంపీలు వేం నరేందర్ రెడ్డి , చామల కిరణ్ కుమార్ రెడ్డి , విప్ బీర్ల ఐలయ్య , రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తో పాటు సంబంధిత ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కామారెడ్డి వాసి రామానంద యోగికి భారతీయ పద్మభూషణ్ అవార్డు

కామారెడ్డి, బతుకమ్మ :
కామారెడ్డి జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత బి.ఆర్.రామనంద యోగికి ప్రతిష్మాత్మక భారతీయ పద్మభూషణ్ పురస్కారం లభించింది. సాహిత్య రంగంలో ఆయన చేసిన విశేష సేవలు, విద్యా నైపుణ్యం,పరిశోధనతో పాటు సామాజిక ఉన్నతికి చేసిన కృషికి గుర్తింపుగా భారతీయ పద్మభూషణ్" బిరుదును దేశ రాజధాని ఢిల్లీలో ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా నలుగురికి ఈ పురస్కారం దక్కగా, తెలంగాణ నుంచి బి.ఆర్.రామనంద యోగి ఎంపికయ్యారు. పురస్కారం అందుకున్న సందర్భంగా ఆయనను కామారెడ్డి పట్టణ ప్రజలు ఘనంగా సన్మానించారు. సాహిత్య రంగంలో తనదైన ముద్ర వేసుకుంటూ ఎన్నో సంవత్సరాలుగా యోగా, రచన రంగాలలోసేవలందిస్తున్న కామారెడ్డికి చెందిన రచయిత బి.ఆర్. రామ నంద యోగికి భారతీయ పద్మభూషణ్" బిరుదు లభించింది. విద్యా నైపుణ్యం, పరిశోధన, సామాజిక ఉన్నతికి ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ సాహిత్య సేవా అవార్డు మండలి మూల్యాంకన డైరెక్టర్ల బోర్డు, ఛైర్మన్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని ప్రధానం చేసినట్లు తెలిపారు.
దేశవ్యాప్తంగా నలుగురికి ఈ అవార్డు దక్కగా, తెలంగాణ నుంచి బి.ఆర్. రామనంద యోగికి ఈ గౌరవం లభించింది. అవార్డు అందుకోవడం పట్ల బి.ఆర్.రామనంద యోగి సంతోషం వ్యక్తం చేశారు. తన గురువు డాక్టర్ బీఆర్ఎస్ అయ్యంగార్ ఆశీర్వాదంతోనే ఈ అవార్డు దక్కిందని పేర్కొన్నారు. ఈ అవార్డు అందుకోవడం వల్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బి.ఆర్. రామనంద యోగిని కామారెడ్డి పట్టణ ప్రజలు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.



